TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 103 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శుక్రవారం.07.11.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




# నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: జూబ్లీహిల్స్ ఉపఎన్నిక విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా లేకుండా ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, అందుబాటులో ఉన్న మంత్రులు పాల్గొన్నారు. ఇప్పటికే మంత్రులు, సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు గడపగడప తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. సీఎం రేవంత్‌రెడ్డి సైతం గత నెల 31, ఈనెల ఒకటి, నాలుగు, ఐదు తేదీల్లో నియోజకవర్గంలోని పలు డివిజన్లలో రోడ్‌షోలు నిర్వహించడంతోపాటు కార్నర్ సమావేశాలు నిర్వహించారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో, క్షేత్రస్థాయి పరిస్థితులు, సర్వే నివేదికలు, పార్టీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్ర మాలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు, వ్యూహ, ప్రతివ్యూహాలు తదితర అంశాలపై సమీక్ష చేసినట్టు తెలిసింది. మొత్తం మంత్రులం దరికీ బాద్యతలు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు దిశానిర్దేశం చేసినట్టు సమాచారం.

సీఎం స్థాయిలో తొలిసారి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. సాధారణంగా ఉప ఎన్నికల ప్రచారానికి సీఎం స్థాయిలో ప్రచారం చేయలేదు. రేవంత్‌రెడ్డి మాత్రం పలుమార్లు కార్నర్ మీటింగ్‌లు, ఇతరాల పేర పలుమార్లు నియోజకవర్గంలో కాలుపెట్టారు. మంత్రులకు సైతం ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తూ కార్యాచరణ ఇస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు కావస్తున్నది. త్వరలో రెండో ఏడాది ప్రజా విజయోత్సవాలు సైతం ఘనంగా నిర్వహించాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ప్రత్యేకంగా కమిటీనీ సైతం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజల దృష్టికి తీసుకుపోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర స్టార్‌క్యాంపెయినర్లకు చెబుతున్నారు. దీన్ని ప్రభుత్వ పరిపాలనకు రెఫరెండమ్‌గా భావిస్తున్నట్టు సమాచారం. ఇక్కడ తేడా వస్తే ఢిల్లీలో ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఉన్నాయని సీఎంతోపాటు మంత్రులూ భావిస్తున్నట్టు గాంధీభవన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఈతరుణంలో కాలుకుబలపం కట్టుకుని ప్రచారంలో తిరుగుతున్నారు. గతంలో ముఖ్యమంత్రులు ఎవరూ ఉప ఎన్నికల ప్రచారానికి రాలేదు. కేవలం ఒకే ఒక్క బహిరంగసభకు వచ్చి ప్రచారం చేసి వెళ్లిపోయేవారు. ఇప్పుడు బీఆర్ఎస్ అధినేత జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బాధ్యతను కేటీఆర్‌కు అప్పగించారు. ఇంతవరకు కేసీఆర్ ప్రచారానికి రావడం లేదు. ఈనెల 11 పోలింగ్ ఉన్న విషయం విదితమే. తొమ్మిదో తేదీ వరకే ప్రచారం చేయడానికి అవకాశం ఉంది. ఇంకా రెండు రోజులే బహిరంగ ప్రచారం మిగిలుంది. ఎన్నికకు నాలుగు రోజులుంది. ఈనేపథ్యంలో ఆయా ప్రయివేటు సంస్థల సర్వేలు, ఇతర ఏజెన్సీల నుంచి నివేదికలు తెప్పించుకు ఇటు సీఎం రేవంత్, అటు ప్రతిపక్ష నేత కేసీఆర్ తమ బలాబలాలు బేరీజువేసుకుంటున్నట్టు సమాచారం.

కాంగ్రెస్ సర్కారుకు ఇది సవాల్ కానుంది. గత పదేండ్లుగా బీఆర్ఎస్ సర్కారు జూబ్లీహిల్స్‌ను పట్టించుకోలేదని కాంగ్రెస్ నేతలు ప్రచారంలో ఓటర్లకు వివరిస్తున్నారు. హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేశారంటూ ఆరోపణలు, విమర్శలకు దిగుతున్నారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రతియేటా నగరాభివృద్ధికి రూ. 10 వేల కోట్లు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్నారు. ఇదిలావుండగా బీఆర్ఎస్ మరోలా ప్రచారంయుద్ధం చేస్తున్నది. తాము ఐటీని భారీస్థాయిలో అభివృద్ధి చేశామని బీఆర్ఎస్ నేతలు చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ తరపున యువ నేత నవీన్‌యాదవ్, బీఆర్ఎస్ తరపున మాగంటి సునీత మధ్య బరి ఆసక్తికరంగా మారింది. దేశవ్యాప్తంగా ఈ ఎన్నిక పట్ల ఆసక్తి నెలకొంది.

# ప్రజలు కేటీఆర్ సెంటిమెంట్ పాలిటిక్స్ ను నమ్మి మోసపోవద్దు: మంత్రి కోమటిరెడ్డి




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: గత రెండేళ్లుగా అసెంబ్లీకే రాని కేసీఆర్ రాబోయే మూడేళ్ల తర్వాత అధికారంలోకి ఎలా వస్తారని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా గురువారం ఆయన ప్రచారంలో పాల్గొని మాట్లాడుతూ..కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ నగర అభివృద్ధి జరిగిందని అన్నారు. ప్రజలు కేటీఆర్ సెంటిమెంట్ పాలిటిక్స్ నమ్మి మరోసారి మోసపోవద్దని హెచ్చరించారు. కాళేశ్వరం పేరుతో, ధరణి పేరుతో గత ప్రభుత్వం రాష్ట్ర సంపదను దోచుకుందని ఆరోపించారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి ముఖ్యమంత్రితో పాటు మంత్రులమంతా కలిసికట్టుగా పనిచేస్తున్నామని తెలిపారు. ఓటు వేసేముందు ప్రతి ఒక్కరు ఆలోచించి, అధికార పార్టీ అభ్యర్థిని గెలిపించి, నగర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

# చరిత్రలో నిలిచిపోయే విజయాన్ని సాధించారు: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: ఐసీసీ మహిళల వన్డే వరల్డ్ కప్‌ను టీమిండియా కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ముంబాయి వేదికగా జరిగిన ఫైనల్ పోరులో దక్షణఫ్రికా టీంను 52 పరుగులతో తేడాతో ఇండియా చిత్తు చేసింది. దీంతో మహిళల జట్టుపై దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తోంది. అదే విధంగా బుధవారం పీఎం ప్రధాని మోడీ టీం సభ్యులను ఆహ్వానించి అభినందించారు. తాజాగా భారత్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఉమెన్స్ టీంను ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానించి అభినందించారు. చరిత్రలో నిలిచిపోయే విజయాన్ని సాధించారని కొనియాడారు. అంతిమ పోరులో విజయం సాధించిన టీంతో ఉండటం చాలా ఆనందంగా ఉందని, ప్రపంచ వ్యాప్తంగా టీమిండియా విజయాన్ని భారతీయులు వేడుకగా జరుపుకుంటారని, జట్టు సభ్యులంతా ఇదే ఆటతీరతో దేశానికి కీర్తి ప్రతిష్ట మరిన్ని తీసుకురావాలని తాను ఆశిస్తున్నానని భారత మహిళల క్రికెట్ జట్టుతో అధ్యక్షురాలు ద్రౌపది ముర్ము అన్నారు. ఆ తర్వాత టీమిండియా జెర్సీని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బహుమతిగా టీం సభ్యులంత కలిసి అందజేశారు.

# మూసీకి ముప్పు..!




నకిరేకల్ : 1954లో సోలిపేట గ్రామం వద్ద మూసీనదిపై ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 1963లో పూర్తి చేశారు. నాటి నుంచి 1987 వరకు ఎడమవైపు 41కిలోమీటర్లు, కుడివైపు 38 కిలో మీటర్ల పొడవునా మొత్తం 42 గ్రామాల రైతులకు 43 వేల ఎకరాలకు సాగునీరు అందేది. స్కావర్ గేట్లను కాంక్రీట్‌తో శాశ్వతంగా మూసేసిన తర్వాత ఆయకట్టు 33వేల ఎకరాలకు పడిపోయింది. మూసీ ప్రాజెక్టు నిర్వహణకు ప్రతి ఏటా సుమారు రూ.25 లక్షలు ఖర్చవుతోంది. గేట్ లీకేజీలు, జనపనార, గ్రీజు ఆయిల్ తదితరాలకు సుమారు రూ.13 లక్షల వరకు ఖర్చు అవుతోంది. ప్రాజెక్టు డ్యాంపై కరెంటు నిర్వహణ కోసం రూ.12 లక్షల వరకు వ్యయమవుతున్నది. గతంలో ప్రతి రాష్ట్ర బడ్జెట్‌లోనూ మూసీ నిర్వహణ కోసం నిధులు కేటాయించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అధికారులు ప్రతిపాదనలు పంపిస్తేనే నిధులు విడుదల చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు నిర్వహణ కష్టంగా మారింది.

టెండర్లు పిలిచినా.. ఫలితం శూన్యం..మూసీ ప్రాజెక్టుకు 30 స్కావర్, క్రస్ట్, రెగ్యులేటర్ గేట్లు ఉన్నాయి. వీటిలో 10 స్కావర్ గేట్లను శాశ్వతంగా మూసేశారు. ఎనిమిది క్రస్ట్ గేట్లలో మూడు గేట్ల నుంచి నీరు లీకేజీ రూపంలో వాగులోకి వెళ్తోంది. రెండు దశాబ్దాలుగా గేట్ల నుంచి నీరు లీకేజీ అవుతున్నా మరమ్మతులకు నోచుకోలేదు. మూసీ ప్రాజెక్టు డ్యాం గేట్ల తర్వాతి ప్రాంతంలో డ్యాం గోడల నుంచి కూడా నీరు లీకేజీ అవుతోంది. లీకేజీల వెంబడి చెట్లు పెరిగి ఆ గోడను మరింత బలహీన పరుస్తున్నాయి. మూసీ ప్రాజెక్ట్ డ్యామ్ మరమ్మతులు, గేట్ల లీకేజీలు, డ్యాం రక్షణ గోడలలో గౌటింగ్, మరమ్మతులు తదితరాలకు రూ.75 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ, టెండర్ల కోసం కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. త్వరలో మళ్లీ టెండర్ పిలిచే అవకాశముంది.

రూ.4 కోట్ల ప్రతిపాదనలకు మోక్షమెప్పుడో..?

గతంలో అతిథులు, పర్యాటకులతో కళకళలాడిన మూసీ ప్రాజెక్ట్ అతిథి గృహం నేడు వెలవెలబోతోంది. ఆ గృహానికి మరమ్మతులు, గేట్లకు రంగులు, ఇతర మరమ్మతుల కోసం అధికారులు సుమారు ఐదు నెలల కిందట రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఇంతవరకు ఆ ప్రతిపాదనలకు మోక్షం లభించలేదు.

స్కావర్ గేట్ల మూసివేతతో పెరిగిన పూడిక

మూసీ ప్రాజెక్టులోని పూడికను ఎప్పటికప్పుడూ తొలగించేందుకు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో స్పిల్‌వే అడుగు భాగంలో 10 స్కావర్ గేట్లు ఏర్పాటు చేశారు.

# ప్రాణాలకు భరోసా ఏది?



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: దేశంలోని రోడ్లపై వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. డజన్ల సంఖ్యలో ప్రాణాలు పోతున్నాయి. కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ పాపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత ఎంత? తెలుగు రాష్ట్రాల్లో జరిగిన వరుస బస్సు ప్రమాదాల తర్వాత ఇప్పుడిదే అంశంపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. రహదారుల నిర్మాణాన్ని పంచేసుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దుర్ఘటనలు జరిగాక, తప్పును ఒకరిపై ఒకరు నెట్టేసుకుంటూ ప్రజల్ని తప్పుతోవ పట్టిస్తున్నారు. సమస్యల పరిష్కారానికి ఎలాంటి ప్రయత్నాలు జరగట్లేదు. బీజాపూర్ జాతీయ రహదారిపై చేవెళ్ల దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంతో పాలకుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం స్పష్టంగా ప్రజలకు అర్థమైంది.

ఈ రోడ్డు విస్తరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం శ్రద్ధ పెట్టలేదు. పైపెచ్చు సింగిల్ రోడ్డుగా ఉన్న ఈ జాతీయ రహదారి నిర్వహణలోనూ లోపభూయిష్టంగా ఉంది. రోడ్ల మధ్య, పక్కన పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయి. వాటిని తప్పించబోయే చేవెళ్లలో టిప్పర్ ఆర్టీసీ బస్సును ఢకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్లు ఇద్దరూ మరణించారు కాబట్టి, జరిగిన ఘోరానికి బాధ్యత ఎవరు తీసుకుంటారనే ప్రశ్న సహజం. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జాతీయ, రాష్ట్ర రహదారులన్నీ గుంతలమయంగా మారాయి. వాటిని ఎప్పటికప్పుడు పూడ్చివేసి, మరమ్మతులు చేయాలి. ఆ పని ఎవరూ చేయట్లేదు. ఫలితంగా రహదారులు రక్తమోడుతున్నాయి. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం 2023లో దేశంలో 4,61,312 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వాటిలో 1,72,944 మంది మరణించారు. 4,43,366 మంది క్షతగాత్రులు అయ్యారు.

2024లో 4.73 లక్షల రోడ్డు ప్రమాదాలు జరిగితే 1.80 లక్షలమంది మరణించారు. క్షతగాత్రుల సంఖ్య దాదాపు 4.50 లక్షలకు పైగానే ఉంది. ఈ మరణాలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బాధ్యత లేదా? ఎవరిపై కేసులు పెట్టాలి. ..ఎవర్ని శిక్షించాలి? అసలు రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులైన కుటుం బాల ఆర్థిక, సామాజిక స్థితిగతుల్ని ప్రభుత్వాలు ఏమన్నా పట్టించుకుంటున్నాయా? వారెంత దైన్యంగా బతుకుతున్నారో కనీసం గణాంకాలన్నా ఉన్నాయా? అంటే ‘లేవు’ అనే నిర్లక్ష్య సమాధానమే వినిపిస్తుంది. ఆర్టీసీ వంటి ప్రజా రవాణాను చంపేసి, రోడ్లపైకి ఇష్టంవచ్చినట్టు ప్రయివేటు వాహనాలకు అనుమతిస్తున్నారు. భారీ వాహనాలకు కనీసం వేగ నియంత్రణలు కూడా లేవు. కొత్త కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తుంటే, అవి తిరిగేందుకు అనువుగా మన జాతీయ, రాష్ట్ర రహదారులు లేవు. అలాం టప్పుడు అనుమతులు ఎలా ఇస్తున్నారనే ప్రశ్నలకు సమాధానాలూ లేవు.

జాగ్రత్తలు..

రోడ్లు ప్రమాదాలకు కారణాలు అనేకం. వాహనదారులు సైతం రోడ్డు భద్రతా మార్గదర్శకాలు పాటించాలి. సీట్‌బెల్ట్ పెట్టుకోవడం, వాహనాలకు మధ్య దూరం పాటించడం, సిగ్నల్ల ఉల్లంఘనకు పాల్పడకుండా ఉండటం, నిబంధనలకు అనుగుణంగా వేగం పాటించడం వంటి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. దానికి తగినట్టు ఆయా రహదారులపై రేడియం హెచ్చరిక బోర్డుల్ని పెట్టాలి.

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెరగాలి

ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భారీ రోడ్డు నెట్‌వర్క్ వాడుకుంటున్నది. రాష్ట్రంలో ఆర్టీసీని 11 రీజియన్లుగా విభజించారు. ఇందులో 97 డిపోల పరిధిలో 364 బస్టేషన్లు ఉన్నాయి. ఆర్టీసీబీ అద్దె బస్సులు కలిపి మొత్తం 9,094 బస్సులు ఉన్నాయి ఆర్టీసీ బస్సుల్లో సీటింగ్ కెపాసిటీ ప్రకారం నడిపితే రాష్ట్రంలో ప్రజల అవసరాల కోసం మొత్తం 27 వేల బస్సులు అవసరం. ఏసీ, నాన్ ఏసీ, గ్రామీణ, పట్టణ బస్సులతోపాటు ఎలక్ట్రిక్ బస్సులు ప్రస్తుతం ప్రయాణీకులకు సేవలందిస్తున్నాయి.

మొత్తం 3,328 రూట్లల్లో ఆర్టీసీ బస్సులు తిరుగుతున్నాయి. 11,104 గ్రామాలకు ఆర్టీసీ నెట్‌వర్క్ఉంది. ఇప్పటికీ రాష్ట్రంలో 1701 గ్రామాలకు బస్సులే వెళ్లకపోవడం గమనార్హం. ఆర్టీసీ బస్సులకు 75.89 శాతం ఆక్యుపెన్సీ రేషియా ఉంది. ప్రతిరోజూ 32.02 లక్షల కిలోమీటర్లు తిరుగుతూ 54 లక్షల మంది ప్రయాణీలను తమ గమ్యస్థానాలకు చేరుస్తు న్నాయి. రోడ్ల డిజైన్లు సక్రమంగా లేకపోవడం, భద్రతా ప్రమాణాలను పాటించకపోవడం, భారీగా ట్రాఫిక్ జామ్‌లు, రన్నింగ్ టైం అంటూ ఆర్టీసీ డ్రైవర్లపై ఒత్తిళ్లు వంటివి ప్రమాదాలకు కారణమ వుతున్నాయి. ఈ సమస్యల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పరిష్కారించాలి. ప్రజలకు మెరుగైన రహదారి ప్రయాణాన్ని అందించేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

బ్లాక్ స్పాట్లు

రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రమైన మూలలు, ఇతర ఇబ్బందులతో కూడిన 930 బ్లాక్ స్పాట్లు ఉన్నాయి. జాతీయ రహదారి 65 (హైదరాబాద్ నుంచి విజయవాడ) పై 17 బ్లాక్ స్పాట్లు ఉన్నాయి. హైదరాబాద్ నుంచి తాండూరు మీదుగా వెళ్లే 163 రహదారిలో 50 భారీ గుంతల్ని గుర్తించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ చుట్టూ 54 బ్లాక్ స్పాట్లను ఆర్అండ్‌బీ గుర్తించింది. వీటికి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయడం, సైన్‌బోర్డులు పెట్టడం, భద్రతాపరమైన అవగాహన కల్పించే పనుల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలి. ఈ బ్లాక్‌స్పాట్లలోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

రాష్ట్రంలో ఇదీ పరిస్థితి

రాష్ట్రవ్యాప్తంగా1.10లక్షల కిలోమీటర్ల రోడ్డు నెట్‌వర్క్ఉంది.ఇందులో రోడ్లు, భవనాలశాఖలో పరిధిలో 32,500 కిలోమీటర్లు ఉంది.స్టేట్ రోడ్డు 27,461 కిలోమీటర్లు, జాతీయ రహాదార్లు 2690 కిలోమీటర్ల మేర ఉంది.ఇందులో జిల్లాలకు సంబంధించిన మేజర్ రోడ్లు 12,079 కిలోమీటర్లు ఉన్నాయి.ఈ రోడ్ల నిర్మాణం,నిర్వహణ సక్రమంగా చేస్తే ప్రమాదాలకు చెక్ పెట్టొచ్చు.

## బాల్య వివాహ రహిత తెలంగాణ సాధనలో భాగంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నెలరోజులపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు






సమావేశంలో మాట్లాడుతున్న శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి బాల్య వివాహ రహిత తెలంగాణ సాధనలో భాగంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నెలరోజులపాటు (నవంబర్ 1 నుంచి డిసెంబర్ 1 వరకు) ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు జిల్లాలో ప్రారంభమయ్యాయి. బేటి బచావో%-%బేటి పాడావో కార్యక్రమం భాగంగా గురువారం స్థానిక భుక్తాపూర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా మాట్లాడుతూ, బాల్య వివాహాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారి యొక్క శారీరక, మానసిక ఎదుగుదలకు బాల్య వివాహం పెద్ద అడ్డంకిగా మారుతుందని, తక్కువ వయసులో వివాహం వల్ల విద్యా అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థులకు వివరించారు. బాల్య వివాహం చట్టరిత్యా నేరమని, దీన్ని అరికట్టడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థాయి కమిటీలు బాల్య వివాహాల నివారణలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు తమ పరిధిలోని డ్రాప్అవుట్ విద్యార్థులను గుర్తించి, తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి విద్యలోకి తీసుకురావడం అత్యంత అవసరమని తెలిపారు. ఏదైనా బాల్య వివాహం సమాచారం తెలిసిన వెంటనే బాలల రక్షణ కోసం 1098, మహిళల భద్రత కోసం 181, అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్లను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు చదువులో రాణించి, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు సమాజంలో అవగాహన కల్పించే బాధ్యత కూడా విద్యార్థులదే అని ప్రోత్సహించారు. అనంతరం అధికారులు, విద్యార్థులతో కలిసి ఆమె బాల్య వివాహ రహిత తెలంగాణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ప్రధానోపాధ్యాయులు సాజీల బేగం, అధికారులు యశోద, రాజేంద్ర ప్రసాద్, సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ లావణ్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలోని అటవీ ప్రాంత ప్రజలందరికీ మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




సమస్య హాజరైన జిల్లా అధికారులు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి గురువారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో జిల్లా స్థాయి అటవీ కమిటీ (డిఎల్ సి) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అటవీ, గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా, మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులు, ప్రాజెక్టులకు అటవీ శాఖ అధికారులు సహకరించాలని చెప్పారు. మెరుగైన వసతుల కల్పన ద్వారా అటవీ ప్రాంత ప్రజల అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. మెరుగైన రోడ్డు, రవాణా సౌకర్యాలు కల్పించడం ద్వారా జిల్లా కేంద్రానికి, మండలానికి కనెక్టివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి తమ పరిధిలో ఉన్న అటవీ అధికారులు శాఖాపరమైన అనుమతులు వీలైనంత త్వరగా ఇవ్వాలని అన్నారు. అనంతరం మాట్లాడుతూ, పివిటిజి మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అడ్డంకులను తొలగించాలని అన్నారు. అవసరమైతే రెవెన్యూ, అటవీ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి సర్వే చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఎఫ్ఓ నాగినిభాను, ఆర్డీఓ రత్నకళ్యాణి, డిపిఓ శ్రీనివాస్, ఏడి సర్వే / ల్యాండ్ రికార్డ్ ఆర్. సుదర్శన్, రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్ట గ్రామంలో బిసి జేఏసి కార్యవర్గం ఏకగ్రీవం

### బీసీలంతా ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలి మండల ప్రధాన కార్యదర్శి రావుల శ్రీనివాస్ పిలుపు



నూతనంగా ఎన్నుకోబడిన బీసీ జేఏసీ కార్యవర్గ సభ్యులు

నిర్మల్ జిల్లా ముధోల్ నవంబర్ 6 అమృత్ తెలంగాణ ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో బిసి జేఏసీ కార్యవర్గంన్ని బిసి జేఏసీ మండల ప్రధాన కార్యదర్శి రావుల శ్రీనివాస్, ఆధ్వర్యంలో బిసి జేఏసీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఆయన మాట్లాడుతూ బీసీలు అంత ఏకమై మనకు కావాల్సిన రిజర్వేషన్ హక్కులను పొందే వరకు మనమందరం శాంతియుతంగా పోరాడాలని తెలిపారు ఈ కార్యక్రమంలో నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులు అధ్యక్షులు లోల మురళి, ఉపాధ్యక్షులు సాకలి గంగాధర్, సరుగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సార్థ పోశెట్టి,

గుండ్ల ముత్యం, కోశాధికారి శాల భోజన్న, ఎస్కే మీనాజ్, సెక్రటరీ అవుసలీ ప్రసాద్, సలహాదారులు ఎస్ కే సాజిద్ తదితరులను ఎన్నుకోవడం జరిగింది

## క్రీడల ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

### అట్టహాసంగా 11వ జోనల్ స్థాయి క్రీడా పోటీల ప్రారంభం.




సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి క్రీడల ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం సోన్ మండలంలోని లెఫ్ట్ పోచంపాడు గ్రామంలోని, తెలంగాణ బాలికల సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలో 11వ రాష్ట్ర జోనల్ లెవెల్ స్పోర్ట్స్ / గేమ్స్ మీట్ 2025– 26 క్రీడా పోటీల కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జోన్ పరిధిలో నాలుగు జిల్లాలకు చెందిన 1190 మంది విద్యార్థులు వివిధ క్రీడాంశాల్లో పాల్గొనబోతున్నారని తెలిపారు. క్రీడా స్ఫూర్తిని నిలబెడుతూ, ఆటల పోటీల్లో పాల్గొనాలని సూచించారు. జీవితంలో గెలుపోటములు సహజమని, ఓడినవారు నిరాశ చెందకుండా గెలుపు కోసం మళ్లీ ప్రయత్నిస్తూ, గెలుపొందిన వారు మరింత మంచి ఫలితాలు సాధించేలా పట్టుదలతో కృషి చేయాలన్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని వివరించారు. బాలికలు, బాలురితో సమానంగా విద్యార్థి దశ నుంచే క్రీడలను జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని అన్నారు. క్రీడల వల్ల శారీరక మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు. ప్రస్తుత సమాజంలో బాలికలు అన్ని రంగాలలో పైచేయి సాధిస్తున్నారని తెలిపారు. ఇటీవలి మహిళా క్రికెట్ ప్రపంచ కప్ విజేతగా భారత దేశ మహిళా జట్టు నిలవడం ఉదహరిస్తూ, బాలికలు క్రీడలను కెరీర్ గా ఎంచుకోవాలని సూచించారు. క్రీడల అభివృద్ధికి పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందని, ఈ అవకాశాలను చక్కగా వినియోగించుకుంటూ క్రీడల్లో పాలుపంచుకోవాలని తెలిపారు. క్రీడల్లో భాగస్వామ్యం అవ్వడం ద్వారా పొందిన ధ్రువీకరణ పత్రాల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సులువు అవుతుందని చెప్పారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో చదువును ఆపవద్దని, ఉన్నత చదువులు చదివిన వారికి ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ విషయాలు విద్యార్థులకు తెలియజేసేలా పాఠశాలల్లో కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీలలో పాల్గొనబోయే విద్యార్థులకు, కార్యక్రమ నిర్వాహకులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, క్రీడల్లో పాల్గొనబోయే విద్యార్థులకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఆటలు ఆడాలని తెలిపారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని వివరించారు. గతంతో పోలిస్తే క్రీడల్లో బాలికల భాగస్వామ్యం పెరిగిందని తెలిపారు. సీఎం కప్ పోటీలలో బాలికలు అధిక సంఖ్యలో పాల్గొని, గతంలో ఎన్నడూ లేని విధంగా పతకాలు సాధించాలని గుర్తుచేశారు. అంతకుముందు క్రీడ పోటీల్లో పాల్గొనబోయే వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు, ఎన్ సి సి పరిచయ కవాతును నిర్వహించారు. జాతీయ జెండా, కార్యక్రమ జెండాలను కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. నిర్వాహకులు కలెక్టర్ అధికారులకు జ్ఞాపికలను అందజేశారు. ఆ తర్వాత తొలి రోజు నిర్వహిస్తున్న క్రీడలలో పాల్గొంటున్న విద్యార్థులను పరిచయం, చేసుకొని వాలీబాల్ ఆడటం ద్వారా క్రీడా కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈవో భోజన్న, డిఐఈఓ పరశురాం, డివైస్ఓ శ్రీకాంత్ రెడ్డి, తహసిల్దార్ మల్లేష్, ఇతర అధికారులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు.

## వ్యవసాయ శాఖ డైరెక్టర్ కమిషనర్ ను కలిసిన ఎమ్మెల్యే రామారావు పటేల్.......

హైదరాబాద్ నవంబర్ 6 అమృత్ తెలంగాణ వ్యవసాయ శాఖ డైరెక్టర్ కమీషనర్ డాక్టర్ బి. గోపి ని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ హైదరాబాద్ లోని కమిషనరేట్ కార్యాలయం లో గురువారం కలిశారు. రబీ సీజన్ లో రైతాంగానికి యూరియా కొరత రాకుండా చూడాలని కోరారు. నియోజకవర్గం లో ఖాళీగా ఉన్న మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారుల పోస్టులను నియమించాల న్నారు. తమ పంటను అమ్ముకోవడానికి కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వారికి వ్యవసాయ శాఖ ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందజేసి కౌలు రైతుల పేరిట పంట కోనేలా చర్యలు చేపట్టాలన్నారు భారీ వర్షాల తో నియోజకవర్గం లో అపార పంట నష్టం జరిగిందన్నారు.ప్రభుత్వం ద్వారా ఆదుకునేందుకు.చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే వెంట సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఉన్నారు.




వ్యవసాయ శాఖ డైరెక్టర్ కమిషనర్ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

## చిన్న నీటి పారుదల వివరాల గణాంక ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి చిన్న నీటిపారుదల గణాంక వివరాల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో, 7వ చిన్న నీటి పారుదల గణాంక నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చిన్న నీటిపారుదల కింద వచ్చే సహజ, మానవ నిర్మిత బోర్లు, బావులు, చెరువులు, కుంటలు, కాలువలు, తదితర వివరాలన్నింటినీ పకడ్బందీగా సేకరించాలని అన్నారు. ఈ సర్వే నిర్వహణ కొరకు గ్రామీణ స్థాయిలో జిపిఓలు, పంచాయతీ కార్యదర్శులను ఎన్యుమరేటర్లుగా నియమించాలని అన్నారు. వివరాల నమోదుకు సంబంధించి నిర్దేశించిన అప్లికేషన్ గురించి సర్వే అధికారులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించాలని వివరించారు. చిన్న నీటిపారుదల వివరాలన్నింటిని ఖచ్చితత్వంతో నమోదు చేయాలని అన్నారు. ఈ వివరాలు ప్రభుత్వాలకు పాలసీలు రూపొందించడంలో తోడ్పడతాయని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, జిల్లా ప్రణాళిక అధికారి జీవరత్నం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు తనికి చేసిన అదనపు కలెక్టర్.



మెట్ పల్లి రూరల్ అమృత్ తెలంగాణ నవంబర్ 06: మెట్ పల్లి మండలం చెవుల మద్ది, రామారావు పల్లి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం అదనపు కలెక్టర్ బి.ఎస్. లత తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్స్, టార్ఫలెన్లు సరిపోయినన్ని అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను

ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్ 18004258187 ను సంప్రదించాలని సూచించారు.

## అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని సబ్ రిజిస్ట్రార్ కు ఫిర్యాదు..

ఊరుకొండ : అమృత్ తెలంగాణ: నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం మాదారం గ్రామానికి చెందిన ఒంటరి మహిళ నాదిరి రేణుక మాదారం గ్రామంలో గల తన ఇందిరమ్మ ఇంటి నెంబర్ 4-127 ఇల్లును అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుని.. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి, తన కుటుంబానికి న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. గురువారం కల్వకుర్తి పట్టణంలోని సబ్ రిజిస్టార్ కార్యాలయంలో సబ్ రిజిస్టార్ కు తమకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇల్లును నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై తగు చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని నాదిరి రేణుక ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులో.. ఊరుకొండ మండల పరిధిలోని మాదారం గ్రామానికి చెందిన తన భర్త నాదిరి లత్తిబాబు గత కొన్ని సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని.. తనకు 11 సంవత్సరాల కూతురు, 9 సంవత్సరాల కుమారుడు ఉన్నట్లు పేర్కొన్నారు. పిల్లలను బ్రతికించుకోవడం కోసం బ్రతుకుతెరువు కావాలని కల్వకుర్తి పట్టణంలో జొన్న రొట్టెలు చేస్తూ పిల్లలను చదివించుకుంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఈవీఎంల గోదాంకు భద్రత: కలెక్టర్

వనపర్తి : అమృత్ తెలంగాణ: జిల్లా కేంద్రంలోని ఈవీఎంలు భద్రపరిచిన గోదాము కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉ ందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. గురువారం ఆర్డీవో కార్యాలయం వెనక ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదాము ను నెలవారీ తనిఖీల్లో భాగంగా ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా గోదాం వద్ద భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శనివారం నెలవారి తనిఖీ లు చేసినట్లు వివరించారు.

# జోరు మీద ఉన్న కాంగ్రెస్ ప్రచారం







అమృత్ తెలంగాణ మెట్ పల్లి నవంబర్ 06: టిపిసిసి డెలిగేట్ మెంబర్ కల్వకుంట్ల సుజీత్ రావు ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు హిమాంగూడ లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తు పై ఓటు వేసి నవీన్ యాదవ్ ను గెలిపించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, ప్రజాసేవ పట్ల కట్టుబాటున్న నాయకుడిగా నవీన్ యాదవ్ ను గుర్తించారని, ఆయనను విశ్వసించి గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నవీన్ యాదవ్ విజయం నియోజకవర్గ అభివృద్ధికి కొత్త ఊపును ఇస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై గట్టి విశ్వాసం ఉంచారని,ఆ నమ్మకం ఈ ఎన్నికల్లో ఓట్ల రూపంలో ప్రతిబింబిస్తుందని తెలిపారు. నవీన్ యాదవ్ విజయం ఆ ప్రజా విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.ఈకార్యక్రమములో కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాకిటి సత్యం రెడ్డి,మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఖుతుబోద్దీన్ పాషా, సేవాదళ్ ప్రధాన కార్యదర్శి అందే మారుతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు,కోరే రాజకుమార్,మహమ్మద్ జాఫర్ రాజేందర్,రాజేష్ సాయిబుద్దీన్,సమీర్, తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ప్లాంట్ యజమానులకు అవగాహన కల్పించిన మున్సిపల్ కమిషనర్.





అమృత్ తెలంగాణ మెట్ పల్లి నవంబర్ 06: మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ టి మోహన్ మున్సిపల్ కార్యాలయంలో వాటర్ ప్లాంట్ యజమానులతో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని వాటర్ ప్లాంట్ యజమానులను పిలిచి ఐఎస్ఐ మార్కు పర్మిషన్ తెచ్చుకోవాలని రెండు నెలల గడువు ఇస్తున్నామని తెలిపినారు మీరు ఇప్పుడు సప్లై చేసే మంచినీటిని శుద్ధి చేసి ఇవ్వాలని మీరు నీటిని సప్లై చేసేటప్పుడు వినియోగించే ప్లాస్టిక్ డబ్బాలను మంచిగా కడిగి మంచినీరు అందివ్వాలని మీరిచ్చే మంచినీటి వలన ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మంచినీరు కలుషితం వలన ప్రజలు జ్వరాల బారినపడి అనారోగ్యాల పాలవుతారని మంచినీరు కలుషితం కాకుండా చూడాలని తెలిపినారు మంచినీరు డబ్బాలు కడగకుండా అలాగే నింపుకొని సప్లై చేస్తున్నారని మా దృష్టికి వచ్చినది అలా చేసినచో కఠిన చర్యలు తప్పవని తెలిపినారు.రెండు నెలల్లో ఐఎస్ఐ మార్కు పర్మిషన్ కచ్చితంగా తెచ్చుకోవాలని ఆదేశించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ అక్షయ్ కుమార్, ముజీబ్,వాటర్ ప్లాంట్ యజమానులు పాల్గొన్నారు.

# బాధితుల ఫిర్యాదులను, సమస్యలను త్వరగా పరిష్కరించాలి.

**ప్రజలలో పోలీసు పట్ల నమ్మకం పెంచే విధంగా విధుల నిర్వహణ చేపట్టాలి.**
**విపిఓ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలి**
**రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు సక్రమంగా ఉండాలి.**
**గస్తీ నిర్వహిస్తూ, నేరాల నియంత్రణ, పోగొట్టుకున్న సొత్తు రికవరీ చేపట్టాలి.**
**వార్షిక తనిఖీల్లో భాగంగా ఉట్నూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ.**
**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**








అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించడం జరిగింది. మొదటగా జిల్లా ఎస్పీకి, ఉట్నూర్ అదనపు ఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్, ఉట్నూర్ సీఐ ఎం ప్రసాద్, ఎస్సై కె ప్రవీణ్ కుమార్ పూల మొక్క అందజేసి స్వాగతం పలకడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి పరిశుభ్రతను కలిగి ఉండాలని పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతగా వ్యవహరించి వారి సమస్యలను పరిష్కరించే దిశగా త్వరితగతిన సిబ్బందిని కేటాయించి పోలీసుల గౌరవం పెంచేలా విధుల నిర్వహణ చేపట్టాలని సూచించారు. సిబ్బందిచే ప్రత్యేకంగా డ్రిల్ నిర్వహించి ప్రతి శనివారం పర్యట నిర్వహించాలని శారీరక దృఢత్వం శారీరక వ్యాయామం ఆరోగ్యానికి కీలకమని తెలియజేశారు. పోలీస్ స్టేషన్ సిబ్బందికి మాబ్ ఆపరేషన్ డ్రిల్ ను నిర్వహించి అత్యవసర పరిస్థితులలో శాంతిభద్రత సమస్యలు తలెత్తిన పరిస్థితులలో వ్యవహరించవలసిన తీరును పరిశీలించారు. తదుపరి పోలీస్ స్టేషన్ సిబ్బంది యొక్క కిట్ ఆర్టికల్స్ పోలీస్ స్టేషన్ సిబ్బంది కి కేటాయించిన పోలీసు సామాగ్రిని వస్తువులను వాటి నిర్వహణను పరిశీలించారు. పోలీస్ స్టేషన్లో దీర్ఘకాలికంగా ఉన్న వాహనాల స్థితిగతులు, వాటి కేసుల వివరాలు తెలుసుకుని పరిశీలించారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లా ఎస్పీ మొక్కను నాటి, పోలీస్ స్టేషన్ అంతటా పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. తదుపరి రిసెప్షన్ సెంటర్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ బాధితుల ఫిర్యాదుల పై దర్యాప్తు పూర్తి చేసి సరైన సమయంలో న్యాయం చేపట్టాలని తెలిపారు. పిటిషన్ ఎంక్వయిరీ సంబంధిత విపిఓ ద్వారా నిర్వహించాలని, విలేజ్ పోలీస్ ఆఫీసర్ విధానాన్ని సక్రమంగా అమలు చేస్తూ సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని ఎలాంటి అసాంఘిక కార్యకలాపాల సమాచారమైన క్షణాల వ్యవధిలో పోలీసులకు సమాచారం అందించేలా నిఘా వ్యవస్థను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కేసుల దర్యాప్తు, కోర్టుల నందు పెండింగ్లో ఉన్న కేసుల వివరాలు, సమన్సు, వారెంట్లు పెండింగ్లో ఉన్న వాటిని సరైన సమయంలో పూర్తి చేయాలని తెలిపారు. స్టేషన్ రికార్డుల నిర్వహణ, దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న కేసుల దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేసేలా కృషి చేయాలన్నారు. కోర్టు నందు శిక్షలు పడినప్పుడు బాధితులకు పోలీసు తరపున న్యాయం లభిస్తుందనే విషయాన్ని గుర్తు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి సమయాలలో గస్తీ నిర్వహిస్తూ ఆర్థిక నేరాలను అరికట్టే విధంగా విధుల నిర్వహణ చేపట్టాలన్నారు, రాత్రి సమయాలలో ఫింగర్ ప్రింట్ యంత్రం ద్వారా తనిఖీ నిర్వహిస్తూ అనుమానస్పద వ్యక్తుల వేలిముద్రలను సేకరించాలని సూచించారు. ఆర్థిక నేరాలు జరిగిన కేసులలో దర్యాప్తు పూర్తి దొంగలను పట్టుకొని, కేసుల నందు రికవరీ చేసి బాధితులకు సరైన న్యాయం చేపట్టాలని సూచించారు. అసంఘిక కార్యకలాపాలు గంజాయి గుడుంబా గాంబ్లింగ్ లాంటివి నిర్వహించకుండా విపిఓ విధానం ద్వారా అరికట్టాలని సూచించారు. మండల పరిధిలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు సమాచారాన్ని తెలుసుకుంటూ వి పి ఓ లు ప్రజారక్షణలో తమ వంతు పాత్ర పోషించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పి కాజల్ సింగ్ , ఉట్నూర్ సిఐ మడావి ప్రసాద్, ఉట్నూర్ ఎస్సై కె ప్రవీణ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగహన కలిగి ఉండాలి: ఎస్పీ శరత్ చంద్ర పవార్





నల్లగొండ :అమృత్ తెలంగాణ: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి రోజు దేశ వ్యాప్తంగా అనేక మంది సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసాలకు గురవుతున్నారనీ,వారి బారిన పడకుండా ప్రతి ఒక్కరికి అవగాహన కల్గిఉండమే ఉత్తమ మార్గం అని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. సైబర్ జాగారుకత దివాస్ సందర్భంగా గురువారం నల్లగొండ పట్టణం కేంద్రంలోని దీప్తి నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు, సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ పాల్గొని మాట్లాడుతూ. .ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఎక్కువగా సులభంగా మోసపోయేది సైబర్ నేరగాళ్ల ద్వారానే అని అన్నారు.కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. డబ్బుల పోయాక బాధపడటం కంటే అవగాహనా తో వ్యవహరించి జాగ్రత్తగా ఉండాలని అన్నారు. చదువుకున్న విద్యార్దులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉంటే తన చుట్టూ పరిసరాల్లో ఉన్న ప్రజలకు,వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తద్వారా సైబర్ మోసాలు నిరోధించవచ్చునని ,సైబర్ నేరగాళ్లు ప్రజలనూ మోసం చేస్తున్న విధానాన్ని కళాశాల విద్యార్థినులకు తెలియజేశారు. ప్రస్తుత కాలం లో జరుగుతున్న నేరాలు అయిన ఏపీకే ఫైల్స్ వాట్సప్ లో ఫార్వర్డ్ చేస్తున్నారు,ఈ ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేస్తే ఫోన్ హ్యాక్ కు గురి అయి డబ్బులు పోయే అవకాశం ఉందన్నారు, అలాగే జంప్డ్ డిపాజిట్ స్కీం, డిజిటల్ అరెస్టు, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, సైబర్ బుల్లింగ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే బ్యాంక్ అదికారులు ఎవరు కూడా ఫోన్ చేసి ఓటీపీ వివరాలు అడగరు అనే విషయాలను గుర్తించాలని ,బ్యాంక్ వారు ఏలాంటి మెసేజ్ లు గాని, లింక్స్ పంపరని ఇట్టి విషయాలు గమనించి మీ కుటుంబ సభ్యులకు తెలియజేయాలని, ఏమైన సందేహాలు ఉంటే బ్యాంక్ కు వెళ్లి నిర్ధారించుకోవాలి అని అన్నారు. గ్రూప్ లలో లేదా వ్యక్తిగత నెంబర్ లకు అపరిచిత వ్యక్తుల నుండి ఎస్ ఎమ్ ఎస్ ఈ మెయిల్స్ ద్వారా గాని, వాట్సాప్ ట్విట్టర్ ద్వారా వచ్చే బ్లూ కలర్ లింక్స్ ను క్లిక్ చేసి మోసపోవద్దని, అలా వచ్చే మెసేజ్ లకు స్పందించవద్దనీ తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెంటనే స్పందించి 1930 కి సమాచారం అందించి ఎం సి ఆర్ పి పోర్టల్ లో ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ వారు తక్షణమే స్పందిస్తారు. తద్వారా పోయిన డబ్బులు రికవరీ చేసుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమ0లో సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ ఎస్బీ సీఐ రాము,1 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్.ఐ విష్ణు,, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# తిమ్మాపురం నిర్వాసితులకు నష్టపరిహారం ఇప్పించాలి



భువనగిరి : అమృత్ తెలంగాణ: భువనగిరి మండలంలోని బిఎన్ తిమ్మాపురం గ్రామంలో ఉన్న ఇండ్ల నష్టపరిహారం త్వరగా ఇప్పించాలని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. త్వరగా వస్తే నూతన ఆర్ అండ్ ఆర్ కాలనిలో ఇండ్లు నిర్మించుకుంటామని, నూతన కాలనిలో ప్రభుత్వ భవనాలు ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాలు గ్రామపంచాయతీ భవనం ,అంగన్వాడీ భవనాలు త్వరగా నిర్మించాలని, కాలనిలో రోడ్లు, మంచినీటి వ్యవస్థ డ్రైనేజీ,వీధి లైట్లు,త్వరగా ఏర్పాటు చేయలనికోరారు. సెక్టార్ 1కి 1-28 గుంటల భూమిని ప్రయివేటు రైతుల వద్ద సేకరించి రోడ్డు సౌకర్యం కల్పించి అందులో ఉన్న 8 మంది నిర్వాసితులకు ప్లాట్లు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ సమస్యలు అన్నింటిపై తక్షణమే వివిధ అధికారులకు ఫోన్ చేసి ముందుగా ఆర్ అండ్ ఆర్ కాలనిలో మౌళికవతులు,నల్లాలు, డ్రైనేజీ,వీధి దీపాలు,తక్షణమే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇండ్ల నష్టపరిహారం కోసం కూడా ప్రభుత్వ అధికారులతో మాట్లాడుతున్నని,నష్టపరిహారం సాధ్యమైనంత త్వరగా చెల్లించే విదంగా చూస్తానని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిన్నం రాజు, మాజీ ఎంపిటిసి ఉడుత ఆంజనేయులు,మాజీ ఉపసర్పంచ్ ఎడ్ల దర్శన్ రెడ్డి,మాజీ సర్పంచ్ రావుల నందు,మాజీ ఎంపిటిసి జిన్న మల్లేశం,పిన్నం శ్రీశైలం, మాజీ వార్డు సభ్యులు వళ్ళందస్ గండయ్య, మాజీ హై స్కూల్ చైర్మన్ దంతురి నర్సింహ,రావుల శ్రీను, మాజీ వార్డు సభ్యులు వళ్ళందస్ పరమేష్,రచ్చ మార్కండేయ,రావుల మహిపాల్ పిన్నం గణేష్ దంతురి భాను గ్రామ నిర్వాసితులు పాల్గొన్నారు.

# వసతి గృహంలో క్రీడాకారుల ఎంపిక



మిర్యాలగూడ : అమృత్ తెలంగాణ: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిర్యాలగూడ డివిజన్ యందు గిరిజన వసతిగృహ, ఆశ్రమ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు క్రీడా ఎంపికలు నిర్వహించారు. ఇందులో 16 వసతిగృహముల విద్యార్థులు 250 మంది హాజరయ్యారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, అథ్లెటిక్స్ యందు ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించిన 100 మంది క్రీడాకారులను నాగర్ కర్నూల్ జిల్లా నందు నిర్వహించే జోనల్ స్థాయి క్రీడా పోటీలకు హాజరు అవుతారని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖఅధికారి చత్రు, జిల్లా సహాయ అధికారి ఎం శ్రీనివాస్ తెలిపారు. మండల విద్యాధికారి ఎల్ బాలునాయక్, ఏసీఎంవో డివి నాయక్, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్ మహేష్, వసతి గృహ సంక్షేమ అధికారులు, పి ఈ టి లు పాల్గొన్నారు.

# బకాయి చెల్లించని సర్కారు కనికరం లేని కాలేజీలు పై చదువులు ప్రశ్నార్థకమేనా!?



కరీంనగర్ అమృత్ తెలంగాణ నవంబర్ 06: అందరూ పట్టాలు పొందిన పోస్టు గ్రాడ్యుయేట్లు. కూలీనాలీ చేసుకుని బతికే ఎస్సీ, ఎస్టీ కుటుంబాల నుంచి వచ్చి కష్టపడి శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో సీటు సాధించారు. రాత్రీ పగలు చదివి మరో చోట బీఈడీలో సీటు పొందారు. తీరా సీటు వచ్చినా చేరలేని దయనీయ స్థితిలో ఉన్నారు. వీరికి ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు రాకపోయేసరికి ఇప్పుడు వీరికొచ్చిన బీఈడీ సీట్లు ప్రమాదంలో పడ్డాయి. మరో వారం రోజుల్లో సొంతంగా ఫీజు చెల్లించి టీసీలు తీసుకుని, కొత్త కళాశాలల్లో అప్పగిస్తేనే సీట్లు దక్కుతాయి. పేద, వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వీరి ఆర్థిక నేపథ్యం అంతంతే. ఒక్కో విద్యార్థి కనీసం రూ.50వేల చొప్పున చెల్లించాలని కళాశాలనుంచి ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రూ. 200 కోట్ల బకాయిలు!**

మూడేళ్లుగా పెండింగ్ లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం (సుప్మా) ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ సోమవారం నుంచి నిరవధిక బంద్ పాటిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 25వేల మంది విద్యార్థులు ఆయా కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు రూ.200కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని, త్వరగా విడుదల చేయాలని కళాశాలల నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్లుగా విద్యార్థులకు ఎంటీఎఫ్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల నిర్వహణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి గత 18 నెలలుగా రకరకాల మార్గాల ద్వారా ఆవేదనను, ఆర్థిక పరిస్థితిని తెలియజేసినా ఎలాంటి స్పందన లేని కారణంగా డిగ్రీ కళాశాలల రాష్ట్ర అసోసియేషన్ పిలుపుమేరకు నిరవధిక బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేసే వరకు డిగ్రీ, పీజి కళాశాలలు నిరవధికంగా బంద్ చేస్తున్నాం. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బంద్ చేసున్నాం. మా అవసరాన్ని, ఆవేదనను ఆర్థిక పరిస్థితిని తెలియజేసినా ఎలాంటి స్పందన లేని కారణంగా డిగ్రీ కళాశాలల రాష్ట్ర అసోసియేషన్ పిలుపుమేరకు నిరవధిక బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేసే వరకు డిగ్రీ, పీజి కళాశాలలు నిరవధికంగా బంద్ చేస్తున్నాం. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బంద్ చేస్తున్నాం. మా అవసరాన్ని, ఆవేదనను ప్రభుత్వం దృష్టి సారించి మాకు, మా విద్యార్థులకు స్కాలర్షిప్లు విడుదల చేయాలి. పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. కళాశాలలు బంద్ పాటిస్తున్నా.. ప్రభుత్వ మౌనం సరికాదు. విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు. వెంటనే పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి. విద్యావేత్తలు,తల్లి దండ్రులు కోరుతున్నారు.

# భూకబ్జా, నకిలీ రికార్డులు, మోసం, కుట్ర కేసులో నలుగురిపై కేసు, ముగ్గురు నిందితులు అరెస్ట్

## నిందితులతో కుమ్మక్కైన రెవెన్యూ అధికారి. మావలా సీఐ కర్ర స్వామి.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి మావల పోలీసులు ఆధ్వర్యంలో భారీ స్థాయి ఆస్తి మోసం, నకిలీ రికార్డులు మరియు కుట్ర కేసును బట్టబయలు చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసు Cr.No.591/2025 కింద IPC సెక్షన్లు 420, 467, 468, 471, 506 రీ/డబ్ల్యూ 34 ప్రకారం నమోదు చేయబడింది. నిందితులు మునిసిపల్ రికార్డులను తారుమారు చేసి లేని స్థలాన్ని అమ్మినట్లు తేలింది.

2025 నవంబర్ 5న ఉదయం 10.00 గంటలకు జడ్పీహెచ్ఎస్ స్కూల్, మన్నూర్లో జూనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్న ఖోదే శ్రీనివాస్ (55) మావల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన దాని ప్రకారం, 2024 జనవరి 23న రెండ్లా శ్రీనాథ్ (A1) అనే వ్యక్తి ఆదిలాబాద్లోని కేఆర్కే కాలనీలో ఉన్న 625 చదరపు అడుగుల స్థలాన్ని (డోర్ నంబర్ 17-168/A1) తాను యజమాని అని చెబుతూ రూ.4,20,000లకు విక్రయించాడు. ఆ స్థలానికి సంబంధించిన మునిసిపల్ అసెస్మెంట్ నంబర్ (1094516814) కూడా తప్పుడు పత్రాల ఆధారంగా చూపించాడు.

దర్యాప్తులో తెలిసిన ప్రకారం, రెండ్లా శ్రీనాథ్ (A1), షేక్ ఫిరోజ్ (A2), సయ్యద్ రేహాన్ హష్మీ ఏ గుడ్డు (A3) ముగ్గురు కలిసి బాధితుడిని మోసం చేసే కుట్ర పన్నారు. వీరు ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఫీల్డ్/రెవెన్యూ ఆఫీసర్గా ఉన్న జాధవ్ కృష్ణ (A4) అనే అధికారితో కుమ్మక్కై రూ.80,000 లంచం ఇచ్చి నకిలీ సెల్ఫ్ అసెస్మెంట్ రికార్డులు, తప్పుడు డోర్ నంబర్ సృష్టించారు. మున్సిపల్ కమిషనర్ 2025 ఆగస్టు 13న సమర్పించిన నివేదికలో ఆ రికార్డులు చట్టబద్ధం కావని, సరైన ధ్రువపత్రాలు లేకుండా నమోదు చేయబడినట్లు ధృవీకరించారు.

విశ్వసనీయ సమాచారం ఆధారంగా మావల పోలీస్ ఇన్స్పెక్టర్ నేతృత్వంలోని బృందం నవంబర్ 5న మధ్యాహ్నం 2.30 గంటలకు బాలాజీ నగర్, కేంద్రియ విద్యాలయ సమీపంలో నిందితులను అరెస్ట్ చేసింది. అరెస్ట్ చేసిన వారు:

A1: రెండ్లా శ్రీనాథ్ (49 సంవత్సరాలు), వ్యాపారి, శాంతినగర్, ఆదిలాబాద్

A2: షేక్ ఫిరోజ్ (33 సంవత్సరాలు), ప్రైవేట్ ఉద్యోగి, కేఆర్కే కాలనీ, ఆదిలాబాద్

A3: సయ్యద్ రేహాన్ హష్మీ ఏ గుడ్డు (26 సంవత్సరాలు), ట్రాన్స్పోర్ట్ వ్యాపారి, కేఆర్కే కాలనీ, ఆదిలాబాద్

వీరి వద్ద నుండి నకిలీ రిజిస్టర్డ్ సేల్ డీడ్ (డాక్యుమెంట్ నంబర్ 3972/2024) మరియు ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వీరు నేరాన్ని ఒప్పుకుని, రూ.4,00,000 నేరార్జిత మొత్తాన్ని ఇలా పంచుకున్నట్లు తెలిపారు ు A1కి రూ.1,50,000, A2కి రూ.1,25,000, A3కి రూ.1,25,000. ఫిర్యాదు చేసిన బాధితుడిని కేసు ఉపసంహరించుకునేలా బెదిరించినట్లు కూడా బయటపడింది.

నిందితులను జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ (PCR) కోర్టు, ఆదిలాబాద్ ముందు హాజరు పరిచారు. 15 రోజుల న్యాయ రిమాండ్ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. నకిలీ రికార్డుల

మొత్తం గొలుసును కనుగొనడం, అసలు పత్రాలు స్వాధీనం చేసుకోవడం మరియు పరారీలో ఉన్న జాధవ్ కృష్ణ (A4)ను పట్టుకోవడంపై దర్యాప్తు కొనసాగుతోంది.

ఈ కేసులో నిందితులను పట్టుకుని మోసం బట్టబయలు చేసిన మావల పోలీసుల కృషిని జిల్లా పోలీసు అధికారి అభినందించారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసులు భూకబ్జాలు, అవినీతి, నకిలీ రికార్డులు వంటి నేరాలను నిర్మూలించేందుకు కట్టుబడి ఉన్నారని తెలిపారు.

# పంచాయతీరాజ్ శాఖ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

రాజన్న సిరిసిల్ల :అమృత్ తెలంగాణ: పంచాయతీ రాజ్ (పీఆర్) ఆధ్వర్యంలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో విద్యా శాఖ, పంచాయతీ, అంగన్వాడీ, ఆరోగ్య శాఖ భవనాలు, ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద జిల్లాలో మొదలు పెట్టిన పనులపై వివిధ శాఖల, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. జిల్లాలో 49 అంగన్వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరు కాగా, పలు భవనాలు పూర్తి కాగా, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయని ఇంచార్జి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా పనులను పూర్తి చేసి, పిల్లలను ఆకట్టుకునే రంగులు వేయాలని, నీటి వసతి మిషన్ భగీరథ ద్వారా కల్పించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ భవనాల పనులను వేగంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. భవిత కేంద్రాల భవనాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, గడువు పెట్టి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 13 కేజీబీవీ ల్లో మంజూరు అయిన అదనపు తరగతి గదులు, మరమ్మత్తు పనులను వెంటనే చేపట్టాలని, విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చేయాలని సూచించారు. ఎంపీ ల్యాడ్స్ కింద జిల్లాకు మంజూరు అయిన పనులను వెంటనే మొదలు పెట్టి 15 రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. పీహెచ్సీలు, సబ్ సెంటర్ల పనులను పూర్తి చేసి, వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించాలని సూచించారు. ఇంకా మొదలు పెట్టని పనులకు వెంటనే టెండర్లు చేయాలని, గడువులోగా పూర్తి చేయించి, ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, పనులను పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు.

# పోలీస్ నార్కోటిక్ జాగిలాలతో ఆకస్మిక తనిఖీలు

రాజన్న సిరిసిల్ల :అమృత్ తెలంగాణ: సిరిసిల్ల పట్టణ పరిధిలోని పాన్ షాపులు, లాడ్జీలలో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ నటేష్ ఆధ్వర్యంలో టాస్క్ఫోర్స్ సిబ్బంది నార్కోటిక్ జాగిలాలతో ఆకస్మిక విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయి లాంటి పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని,టాస్కోర్స్ సిబ్బంది మత్తు పదార్థాలను గుర్తించే నార్కోటిక్ జాగిలలతో తరచు జిల్లా పరిధిలో ఉన్న లాడ్జిలలో,పాన్ షాప్,కిరాణా షాప్ లలో,బస్టాండ్ ప్రాంతాల్లో,రద్దీగల ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రజలకి మత్తు పదార్థాల వల్ల కలుగు అనార్థాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారుజిల్లాలో గంజాయి రవాణా చేసిన,అమ్మిన,సేవించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధించిన గంజాయి లాంటి మత్తు పదార్థాల సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ లో సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# ఆ కామెంట్స్ నన్ను బాధించాయి అంటున్న జాన్వీ కపూర్......



బాలీవుడ్ లో అతిలోక సుందరి శ్రీదేవి కూతురు అనే బ్రాండ్ ఇమేజ్ తో హీరోయిన్ గా అడుగుపెట్టిన అందాల భామ జాన్వీ కపూర్. ఈ అమ్మడు కెరియర్ ఆరంభం నుంచి కమర్షియల్ సినిమాలు కంటే కథాబలం ఉండి తనని తాను ఎస్టాబ్లిష్ చేసుకునే సినిమాలే ఎక్కువగా చేస్తూ వస్తుంది. రెండో సినిమానే ఏకంగా బయోపిక్ కథని ఎంపిక చేసుకొని అందరికి షాక్ ఇచ్చింది. ఈ మూవీతో కూడా ఆమె మెప్పించింది. ఇక ఫిమేల్ సెంట్రిక్ కథలతో ఈ అమ్మడు వరుస సినిమాలు చేసుకుంటూ వెళ్తుంది. ఇప్పుడు కమర్షియల్ సినిమాల వైపు దృష్టి పెడుతుంది. నటిగా తనని తాను ప్రూవ్ చేసుకోవడంతో కమర్షియల్ హీరోయిన్ గా ఎస్టాబ్లిష్ అయ్యే ప్రయత్నం మొదలు పెట్టింది. ఇదిలా ఉంటే తాజాగా ఈ అమ్మడు ఓ ఇంటర్వ్యూలో తన కెరియర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. సినిమా ఇండస్ట్రీలోకి నటిగా అడుగుపెట్టిన ఆరంభంలో చాలా మంది తనని నెపోకిడ్ అంటూ సోషల్ మీడియాలో దారుణంగా విమర్శిస్తూ కామెంట్స్ చేసేవారు. నటన రాకుండా ఎందుకు హీరోయిన్స్ అయిపోతారో అంటూ వేధించారు. ఆ కామెంట్స్ చూసినపుడు తీవ్రంగా బాధేసింది. కొన్ని సందర్భాలలో ఆ కామెంట్స్ చూసి కన్నీళ్లు వచ్చేవి. ఎంత బెటర్ గా నటించి మెప్పించే ప్రయత్నం చేసిన కూడా ప్రతి సారి కూడా నెపోకిడ్ ఆమె విమర్శలు వినిపిస్తూ ఉండేవి. తల్లిదండ్రులు సెలబ్రిటీలుగా వారి పిల్లలు సెలబ్రిటీలుగా నటిగా కెరియర్ ఎంచుకొకూడదా అని వారి విమర్శలు చూసినపుడు అనిపించేది.

# ఆ మహిళలతో ఉండటం ఆనందంగా ఉంది - అడవి శేష్

టాలీవుడ్ లో తన మార్క్ స్టోరీ టెల్లింగ్ తో ఎంతో పేరు తెచ్చుకున్నాడు అడవి శేష్. ప్రత్యేక కథలతో థ్రిల్లింగ్ సస్పెన్స్ నేపథ్యంలో సినిమాలు తీస్తూ హిట్ మీద హిట్ కొడుతున్నాడు. తాజాగా హిట్-2తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు ఈ టాలర్ స్టార్. తాజాగా ఈ హీరో తన ఇన్స్టా వేదికగా చేసిన ఓ పోస్టు చాలా మందిని ఆకట్టుకుంటోంది. అందులో అడవి శేష్ తో పాటు బాలీవుడ్ డైరెక్టర్ ప్రొడ్యూసర్ కొరియోగ్రాఫర్ అయిన ఫరాఖాన్ బుట్ట బొమ్మ పూజా హెగ్డేతో కలిసి ఉన్న పిక్ ను పోస్టు చేశారు. ఫరాఖాన్ డైరెక్టర్ గా అడవి శేష్ - పూజా హెగ్డే హీరోహీరోయిన్లుగా ఓ సినిమా తెరకెక్కనుందని అనుకుంటే పొరబడినట్లే. ఎందుకంటే వీరు కలిసింది సినిమా కోసం కాదు. హైదరాబాద్ లో జరిగిన ఫిక్కీ సమావేశానికి వీరు హాజరయ్యారు. ఓ పిక్ లో అడవి శేష్ ఫరాఖాన్ పూజా హెగ్డేతో పాటు ఫిక్కీ ఫ్లో మాజీ ప్రెసిడెంట్ పింకీ రెడ్డితో కలిసి కనిపించారు. మరో పిక్ లో అడవి శేష్ ఫరాఖాన్ పింకీ రెడ్డి ఉన్నారు. ఈ రెండు పిక్స్ పోస్టు చేసిన అడవి శేష్.. వీరితో అద్భుతమైన సమయాన్ని గడిపినట్లు క్యాప్షన్ ఇచ్చారు. సూపర్ వైబ్రంట్ ఫరా ఖాన్ లవ్లీ పూజా హెగ్డే లాంటి విజయవంతమైన విద్యావంతులైన మహిళలతో కలిసి సమావేశంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని పోస్టులో పేర్కొన్నాడు. ఈ యంగ్ హీరో వరుస విజయాలు అందుకుంటూ దూసుకుపోతున్నాడు. గూఢచారి ఎవరు మేజర్ తో హ్యాట్రిక్ విజయాలు సాధించిన అడవి శేష్.. ఇప్పుడు డబుల్ హ్యాట్రిక్



పై కన్నేశాడు. ఈ క్రమంలో ఇటీవలె హిట్-2 తో మరో భారీ సక్సెస్ ఖాతాలో వేసుకున్నాడు. దీంతో తదుపరి రెండు సినిమాలతోనూ హిట్లు అందుకుని డబుల్ హ్యాట్రిక్ నమోదు చేయాలని ప్లాన్ వేశాడు. ఈక్రమంలోనే గూఢచారికి సీక్వెల్ గా జీ-2 ను పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు ప్రకటించారు. మేజర్ తో దక్కిన పాన్ ఇండియా క్రేజ్ ని ఎన్ క్యాష్ చేసుకునేలా ఈ సీక్వెల్ ప్లాన్ చేస్తున్నారు.

# జిగేల్ అనిపించేలా నిధి సోషల్ సోయగాలు..!

ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ సినిమాల లెక్క ఎలా ఉన్నా సోషల్ మీడియాలో మాత్రం విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. ఇస్మార్ట్ శంకర్ తర్వాత కేవలం ఒకటి రెండు సినిమాలే చేసిన అమ్మడు ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో హరి హర వీరమల్లు సినిమాలో నటిస్తుంది. ఆ సినిమాపై చాలా హోప్స్ పెట్టుకుంది నిధి. గల్లా అశోక్ డెబ్యూ మూవీ హీరో లో నటించిన అమ్మడు మరో సినిమాకు సైన్ చేయలేదు. తమిళ్ లో సినిమాలు కొన్ని చేసి అక్కడ క్రేజ్ ఏర్పరచుకుంది. అయితే తెలుగులో ఛాన్స్ లు రాక చేయట్లేదా లేక వచ్చిన అవకాశాలను అమ్మడు కాదంటుందా అన్నది తెలియాల్సి ఉంది.పవన్ సినిమా తప్ప నిధి అగర్వాల్ మరో తెలుగు సినిమాకు సైన్ చేయలేదు. ఇక సినిమాలతో సంబంధం లేకుండా అమ్మడు సోషల్ మీడియాలో రెచ్చిపోతుంది. నిధి అగర్వాల్ ఫోటో షూట్ సోషల్ మీడియా ఫ్యాన్స్ కి స్పెషల్ సర్ ప్రైజ్ అందిస్తున్నాయి. లేటెస్ట్ గా నిధి తన క్రేజీ లుక్స్ తో మరోసారి తన ఫ్యాన్స్ అండ్ ఫాలోవర్స్ ని బుట్టలో వేసుకునే ప్రయత్నం చేసింది. స్లీవ్ లెస్ జాకెట్.. తొడలు కనిపించేలా మిడ్డితో అమ్మడి ఫోటో షూట్ అదరహో అనిపిస్తుంది. అలా క్యూట్ గా చూస్తున్నా తన చూపుల మాయలో పడిపోయి ప్రేక్షకులు గిల గిల తన్నుకుంటున్నారని చెప్పొచ్చు. నటిగా తనని తాను ప్రూవ్ చేసుకోవాలనే తాపత్రయం ఉన్నా అవకాశాలు పెద్దగా లేకపోయే సరికి సోషల్ మీడియాలో ఫోటో షూట్స్ తో రెచ్చిపోతుంది అమ్మడు. అంతేకాదు సోషల్ మీడియాలో తనకున్న ఈ క్రేజీ ఫాలోయింగ్ చూసి ఆమెతో ప్రొడక్ట్ ప్రమోషన్స్ చేయించుకుంటున్నారు. వాటి వల్ల కూడా ఆదాయం వస్తుండటంతో అమ్మడు అలా కూడా సంపాదిస్తుంది.



ఇన్ స్టాగ్రాం ఓపెన్ చేస్తే చాలు నిధి తన యాడ్స్ తోనే కెరీర్ కొనసాగిస్తుందని అనిపిస్తుంది. వీరమల్లు సినిమా రిలీజ్ అయ్యాక ఏమన్నా మళ్లీ తెలుగులో నిధి అగర్వాల్ బిజీ అయ్యే ఛాన్స్ ఉందేమో కానీ ప్రస్తుతం నిధి కేవలం సోషల్ మీడియాతోనే టైం పాస్ చేస్తుంది. ఆమెను ఇన్ స్టాగ్రామ్ లో చూసి సంతృప్తి చెందుతున్న ఫ్యాన్స్ కూడా ఉన్నారు. అందుకే నిధి గేర్ మార్చి తన సినిమాల వేగాన్ని పెంచితే ఈ క్రేజ్ డబుల్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. మరి నిధి అగర్వాల్ తన సినిమాల విషయంలో ఆలోచన మార్చుకుంటుందా లేదా అన్నది చూడాలి.




# ప్రియాంక జవాల్కర్ .. హద్దులు దాటేస్తోందిగా..



యంగ్ హీరోయిన్ ప్రియాంక జవాల్కర్ తెలుగు అభిమానులకు పరిచయం అవసరం లేని పేరు. ఇక ఈ ముద్దుగుమ్మ గ్లామర్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తొలిచూపులతోనే గుండెల్ని కొల్లగొట్టే అందం ఆమె సొంతం. అచ్చమైన తెలుగు హీరోయిన్ గా ప్రేక్షకులను అలరిస్తోంది. అలా ఓ వైపు సినిమాలు మరో వైపు హాట్ హాట్ సొగసులతో కుర్ర కారు గుండెల్ని పిండేసేలా రచ్చ చేస్తోంది. గ్లామర్ విందుతో మతులు పోగొట్టే ఈ బ్యూటీ.. అదిరిపోయే అవుట్ ఫిట్ లో దర్శనమిస్తూ రోజు రోజుకూ మరింతగా మతులు పోగొడుతోంది. ఈ మధ్య తగ్గేదే లేదు అంటూ యమా ఉషారెక్కిస్తుంది అభిమానులను. నిత్యం సోషల్ మీడియాలో ఆక్టివ్ గా ఉంటూ హాట్ ట్రెండీ లో ఫోజులిస్తోంది. హాట్ క్లీవేజ్ షోతో మత్తెక్కిస్తోంది. రోజు రోజుకీ తెగ మెరిసిపోతూ కవ్వి కవ్విస్తోంది. అందం అంత నాదగ్గరే ఉందంటూ తెగ ఎక్సపోసింగ్ చేస్తూ కుర్ర కారుకి చమటలు పట్టిస్తుంది. ట్రెడిషనల్ వేర్ ట్రెండీ వేర్ లో దర్శనమిస్తూ ఫాలోయర్స్ ను ఊర్రూతలూగిస్తోంది. తాజాగా మరో కొత్త ఫోటో షూట్ ను పోస్ట్ చేసింది. ఇవి చూస్తుంటే ప్రస్తుతం ప్రియాంక దుబాయ్ లో ఉన్నట్టు తెలుస్తోంది. వేకేషన్ కోసం అక్కడికి వెళ్లిందా? లేదా ఏమైనా చమూవీ షూటింగ్ కోసం వెళ్లిందా? అన్నది క్లారిటీ లేదు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com